# సాక్షి
## తూర్పుగోదావరి

శుక్రవారం । 8 । నవంబర్ । 2024




### నిత్యాన్నదానానికి రూ.లక్ష


మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కంతేటి రామకృష్ణమూర్తి దంపతులు (ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి) గురువారం రూ.1,00,008 విరాళం సమర్పించారు.



### రూ.1,01,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు బొండాడ సుబ్బరాజు, రాజీ, సుధీర్ (ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్ల) గురువారం రూ.1,01,116 విరాళం అందజేశారు.

### కడలిలోకి 71 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 71,126 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు 5,600 క్యూసెక్కుల నీరు వదిలారు.

## న్యూస్‌రీల్

### ఉచిత ఇసుక విధానం పూర్తిగా విఫలం



విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఐ నేత వనజ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం పూర్తిగా విఫలమైందని, దీనిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఈ నెల 18న సచివాలయాల వద్ద వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని చెప్పిన ప్రభుత్వం.. మరోవైపు ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.6 వేల కోట్లు పైగా విద్యుత్ బిల్లుల భారం మోపాలని నిర్ణయించడాన్ని తప్పుబట్టారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ఎన్నికల్లో తెలుగుదేశం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని చెబుతూ, ఆ లోటును భర్తీ చేసుకునేందుకు ప్రజలపై భారాలు మోపాలనుకోవడం అవివేకమని వనజ అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గిస్తే రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తింటాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

రాజమహేంద్రవరం రూరల్: స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట రీత్యా నేరమని, అలా ఎవరైనా చేస్తే శిక్ష తప్పదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కె.వెంకటేశ్వరరావు అన్నారు. బొమ్మూరులోని తన కార్యాలయంలో రూరల్, అర్బన్ పీహెచ్‌సీల వైద్యాధికారులకు పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తక్కువ లింగ నిష్పత్తి ఉన్న దోసకాయలపల్లి, మార్కొండపాడు, పాలచర్ల, దేవరపల్లి, తాళ్లపూడి పీహెచ్‌సీలు, రాజమహేంద్రవరం వీఎల్ పురం, వాంబే కాలనీ, కంబాలపేట, మొరకవీధి, ఆనంద నగర్, ఇన్నీసుపేట, శంభునగర్, అద్దేపల్లి కాలనీ, నిడదవోలు నెహ్రూనగర్, కొవ్వూరు ఎన్‌జీఓ హోమ్ సొసైటీ యూపీహెచ్‌సీల వైద్యాధికారుల నుంచి రాతపూర్వకంగా వివరణ తీసుకున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రుల్లోని స్కానింగ్ సెంటర్లను తరచుగా తనిఖీ చేయాలన్నారు. అనుమానిత స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ చేయాలని సూచించారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని, హై రిస్క్ గర్భిణులను సామాజిక, ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేయాలని స్పష్టం చేశారు. ఐసీడీఎస్, స్వయం సహాయక సంఘాల గ్రూపులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి వెయ్యి మంది మగ శిశువులకు 970 మంది ఆడ శిశువులు ఉండేలా చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు ఆదేశించారు.

# చెదరని కీర్తి.. నిత్య స్ఫూర్తి

- శత వసంతాల 'దక్షిణ సబర్మతి'
- స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిల్చిన గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమం
- ఎందరో త్యాగధనుల చిరునామా
- సీతానగరంలో నాటి జ్ఞాపకాలు నేటికీ పదిలం
- రేపు శతవార్షికోత్సవం

అది 1924వ సంవత్సరం నవంబర్ 9వ తేదీ. సమయం తెల్లవారుజామున నాలుగు గంటలు కావస్తోంది. రాజమహేంద్రవరానికి సుమారు 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీతానగరం గ్రామంలో ఒక ఆశ్రమానికి శంకుస్థాపన జరుగుతోంది. వ్యవస్థాపకుడు గాంధేయవాది డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం. ఆ చిమ్మచీకటిలో మహర్షి బులుసు సాంబమూర్తి తాళ్ళపూడి గ్రామం వద్ద గోదావరి నదిని దాటుకుని, సీతానగరం ఆశ్రమానికి శంకుస్థాపన చేశారు. 'గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమం' అని నామకరణం చేశారు. అదే సమయానికి 'ఈ ఆశ్రమం భావ వికాసాన్ని కలిగిస్తుందని ఆశిస్తున్నాను' అనే సందేశంతో మహాత్మా గాంధీ టెలిగ్రామ్ పంపించారు. ఇది ఆ కార్యక్రమానికి హాజరైన ప్రజల్లో నూతన స్ఫూర్తిని నింపింది. అనతి కాలంలోనే స్వాతంత్ర్య పోరాటానికి యువతను సిద్ధం చేసే శిక్షణా కేంద్రంగా ఈ ఆశ్రమం రూపుదిద్దుకుంది. దక్షిణ సబర్మతిగా, అహింసా స్వాతంత్ర్య సంగ్రామ కురుక్షేత్రంగా చరిత్రకారుల మన్ననలు అందుకుంది. ఆనాడు ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నంగా ఈ ఆశ్రమం మారిందంటే అతిశయోక్తి కాదు.



సీతానగరంలోని గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమం



సీతానగరం ఆశ్రమంలో బాపూజీ బస చేసిన కుటీరం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం గుంటూరు జిల్లా ఫిరంగిపాడు సమీపంలోని ముగ్గళ్ల గ్రామంలో 1891 అక్టోబర్ 12న జన్మించారు. తండ్రి రామశాస్త్రి, తల్లి లక్ష్మీ నరసమ్మ. కోల్‌కతాలో వైద్య విద్య అభ్యసించిన ఆయన, మిత్రుల సలహాపై 1917లో రాజమండ్రి కంభంవారి సత్రం సమీపాన ప్రాక్టీస్ ప్రారంభించారు. హస్తవాసి మంచిదని పేరు రావడంతో సంపాదనకు లోటు లేకపోయింది. మహాత్ముని పిలుపు మేరకు నాడు దేశ స్వాతంత్ర్యోద్యమం ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటున్న సంధికాలమది. మహాత్ముని పిలుపుతో ఉత్తేజితులైన వేలాది మంది యువకుల్లో ఒకరైన బ్రహ్మజోస్యుల శాసనోల్లంఘన తదితర కార్యక్రమాల్లో పాల్గొని జైలు శిక్షలు అనుభవించారు. స్వరాజ్య సాధనకు గాంధీజీ రూపొందించిన నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఒక ఆశ్రమం నిర్మించాలని భావించారు. శేఠ్ జీవన్‌లాల్ అనే అల్యూమినియం వ్యాపారి, కాంగ్రెస్ అభిమాని అందించిన ఆర్థిక సాయంతో ఆయన సీతానగరంలో ఆశ్రమాన్ని నిర్మించారు. ఖద్దరు వాడకం, అంటరానితనం నిర్మూలన, హరిజనుల ఆలయ ప్రవేశం, స్వరాజ్య పోరాటానికి ప్రజలను ఆయత్తం చేయడం ఈ ఆశ్రమ లక్ష్యాలు. బ్రహ్మజోస్యులతో పాటు చంద్రపట్ల హనుమంతరావు, క్రొవ్విడి లింగరాజు, మద్దూరి అన్నపూర్ణయ్య, గూడూరి రంగయ్య, ధరణీప్రగడ శేషగిరిరావు, ఓలేటి నరసింహం తదితరులు సతీసమేతంగా ఆశ్రమంలో నివాసం ఏర్పాటు చేసుకుని, ఉద్యమంలో పాల్గొన్నారు. శిక్షలు అనుభవించారు.



ఆశ్రమంలోని బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం విగ్రహం

### అపురూప జ్ఞాపకాలు

- సీతానగరం ఆశ్రమాన్ని మహాత్మా గాంధీ 1929, 1933 సంవత్సరాల్లో సందర్శించారు. మొదటిసారి ఆయన సతీసమేతంగా వచ్చారు. లోకమాన్య జయప్రకాష్ నారాయణ కూడా ఆయనతో ఉన్నారు. ఆయన బస చేసిన కుటీరం, ఉపయోగించిన రాట్నం నేటికీ ఈ ఆశ్రమంలో ఉన్నాయి. కుటీరంపై కప్పును మాత్రం మార్చారు.
- ఆశ్రమంలోని జెండా స్తంభంపై ఉన్న జెండాను ఊడబెరకడానికి నాటి కిరాతక డీఎస్పీ ముస్తఫా ఆలీఖాన్ ప్రయత్నించగా.. గుత్తి సుబ్బరాజు అనే 70 ఏళ్లు పైబడిన వృద్ధుడు ప్రతిఘటించి, అరెస్టు అయ్యాడు. ఈ సంఘటనకు తార్కాణంగా నేటికీ ఆశ్రమంలో జెండా స్తంభాన్ని అలాగే ఉంచారు.
- బాబూ రాజేంద్రప్రసాద్ ప్రసంగించడానికి వచ్చిన వేదికను, ఆశ్రమ వాసులు ఉపయోగించిన బావిని సైతం నేటికీ ఇక్కడ సందర్శకులు చూడవచ్చు.

### సంచలనం రేపిన కాంగ్రెస్ పత్రిక

దేశంలో జరుగుతున్న స్వరాజ్య ఉద్యమం పట్ల ప్రజలను చైతన్యపరచడానికి మద్దూరి అన్నపూర్ణయ్య వ్యవస్థాపక సంపాదకునిగా ప్రారంభమైన కాంగ్రెస్ పత్రిక పెనుదుమారం లేపింది. ఆ పత్రికకు చెందిన ఐదుగురు వరుస సంపాదకులు– మద్దూరి అన్నపూర్ణయ్య, కాండ్రేగుల రామచంద్రరావు, చంద్రుపట్ల హనుమంతరావు, క్రొవ్విడి లింగరాజు, రామచంద్రుని వెంకటప్ప ఉత్తేజకరమైన సంపాదకీయాలు రాసి, జైలు శిక్షలు అనుభవించారు.

### ఆశ్రమంపై నిషేధం

నాటి ప్రభుత్వం ఈ ఆశ్రమాన్ని 1932లో 'అక్రమ సంఘం'గా ప్రకటించింది. పోలీసు అధికారులు ఆశ్రమ ఆస్తులను, పత్రిక ముద్రణా యంత్రాన్ని సామగ్రిని ధ్వంసం చేశారు. అదే సంవత్సరం నాళం భీమరాజు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న బ్రహ్మజోస్యులను బయటకు లాగి, దారుణంగా ముస్తఫా ఆలీఖాన్ లాఠీలతో చావబాదాడు. ఈ దాడిలో పక్కటెముకలు విరగడంతో ఆయన క్షయవ్యాధికి లోనయ్యారు. 1936 డిసెంబర్ 26వ తేదీ ముక్కోటి ఏకాదశి నాడు స్వాతంత్ర్య భానూదయాన్ని చూడకుండానే బ్రహ్మజోస్యుల కన్ను మూశారు. ఈ ఆశ్రమ నిర్వహణను 1947లో కస్తూర్బా గాంధీ జాతీయ స్మారక ట్రస్టు చేపట్టింది. రాజమహేంద్రవరంలో బ్రహ్మజోస్యుల పేరిట సుబ్రహ్మణ్యం మైదానం ఉంది. ఇక్కడ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలు జరుగుతాయి.

### శతవార్షికోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

ఈ ఆశ్రమ శత వార్షికోత్సవం నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆశ్రమం చరిత్రను తెలిపే స్థూపం, ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మజోస్యుల, ఆశ్రమంలో నివసించిన స్వాతంత్ర్య పోరాట యోధులు క్రొవ్విడి లింగరాజు, గవేటి వేంకట్రామ దీక్షితుల విగ్రహావిష్కరణలు, విశ్రాంత ప్రిన్సిపాల్ బి.రాజారావు రచించిన దక్షిణ సబర్మతి – గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమం పుస్తకావిష్కరణ తదితర కార్యక్రమాలు ఈ సందర్భంగా జరగనున్నాయి. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొంటారు.

### ఖద్దరు ఆయన ఆరో ప్రాణం



ఖద్దరు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం ఆరో ప్రాణం. ఆయనకు సంతానం ఆలస్యంగా కలగడంతో తన అన్నగారి కుమార్తె కనకాన్ని పెంచుకున్నారు. ఆమె వివాహ ప్రసక్తి వచ్చినప్పుడు, వరుని కుటుంబంలోని వారికి ఖద్దరు కట్టే అలవాటు ఉన్నదని తెలిసి, ఆయన సంబంధానికి అంగీకరించారు. వృత్తి రీత్యా డాక్టర్ కనుక, ఆశ్రమ ప్రాంగణంలో ఒక ఆధునిక ఆసుపత్రి లేదా వృద్ధాశ్రమం నిర్మించాలని, పేదలకు ఉచితంగా సేవలు అందించాలన్నది నా కోరిక.

– బ్రహ్మజోస్యుల సత్యవతి, సుబ్రహ్మణ్యం కోడలు

### ఆశ్రమ చరిత్రను తెలియజెప్పాలి



గోదావరి పరీవాహక ప్రాంతంలో స్వాతంత్ర్య ఉద్యమం, సీతానగరం ఆశ్రమ చరిత్ర రెండూ పెనవేసుకుని ఉన్నాయి. స్ఫూర్తిదాయకమైన ఈ చరిత్రను నేటి తరానికి తెలియజెప్పాలి.

– వారణాసి సుబ్రహ్మణ్యం, బ్రహ్మజోస్యుల మనవడు, రచయిత



చారిత్రక ఘటనకు సాక్షి: జెండా స్తంభం

### త్యాగనిరతి ఆశ్రమం అంతస్సూత్రం



వ్యక్తులను ఆసరాగా చేసుకుని సమూహం, సమూహాలను ఆసరాగా చేసుకుని వ్యక్తులు చైతన్య జ్యోతులను వెలిగించిన నాటి పరిస్థితులు తలుచుకుంటే శరీరం పులకరిస్తుంది. ఆశ్రమం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అయినా, త్యాగనిరతి అనే అంతస్సూత్రం దీనిని బతికించి ఉంచింది.

– డాక్టర్ అరిపిరాల నారాయణరావు, విశ్రాంత ఆచార్యుడు

### పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి

1991లో జరిగిన ఆశ్రమ వ్యవస్థాపకుడు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం శతజయంతి ఉత్సవాల సందర్భంగా నేను రచించిన 'సీతానగర సేవాశ్రమ చరిత్ర' పుస్తకాన్ని పద్మవిభూషణ్ వావిలాల గోపాలకృష్ణయ్య ఆవిష్కరించారు. ప్రస్తుతం నేను రచించిన 'దక్షిణ సబర్మతి–గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమం' పుస్తకాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే, మాజీ శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ శనివారం ఆవిష్కరించనున్నారు. ఈ ఆశ్రమాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.

– బి.రాజారావు, విశ్రాంత ప్రిన్సిపాల్

### వనరులకు కొరత

ఆశ్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి వనరుల కొరత ప్రధాన సమస్యగా ఉంది. ప్రభుత్వ చేయూతతో పాటు వదాన్యుల సహకారం కావాలి.

– జి.సుశీల, ట్రస్టు ప్రాంతీయ ప్రతినిధి



నాడు ఆశ్రమ వాసులు ఉపయోగించిన బావి



గాంధీజీ ఉపయోగించిన రాట్నం



బాబూ రాజేంద్ర ప్రసాద్ ప్రసంగానికి ఏర్పాటు చేసిన వేదిక

## సామాజిక ప్రయోజనం చేకూర్చే పనులకు ప్రాధాన్యం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా ఖనిజ నిధి ద్వారా గతంలో ప్రతిపాదించి, ప్రారంభం కాని వాటి స్థానంలో కొత్తగా సామాజిక ప్రయోజనం చేకూర్చే పనులను ప్రతిపాదించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన జిల్లా ఖనిజ నిధి సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ తదితర శాఖల ఆధ్వర్యాన చేపట్టిన వివిధ పనుల పురోగతి, పెండింగ్ అంశాలపై సమగ్ర నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన పనులకు సంబంధించి స్టేజి వారీగా ఫొటోలతో కూడిన ప్రగతి నివేదికలు సమర్పించాలన్నారు. నియోజకవర్గాల వారీగా ప్రాధాన్య పనులు చేపట్టడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి వివిధ దశల్లో ఫొటోలతో కలిపి బిల్లులు అందజేస్తే పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, చెల్లింపులు జరుపుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

## తొలి దశలో గుర్తిస్తే క్యాన్సర్ చికిత్స సులభం

రాజమహేంద్రవరం రూరల్: క్యాన్సర్ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తేనే చికిత్స సులభతరమవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కె.వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బొమ్మూరులోని తన కార్యాలయం ఆవరణలో ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, క్యాన్సర్ నిరోధకత సాధ్యమేననే విషయాన్ని గృహ స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం ద్వారా ప్రజలకు స్పష్టం చేయాలన్నదే తమ సంకల్పమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు అందిస్తామన్నారు. సకాలంలో స్క్రీనింగ్ చేయడం ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం, తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ సర్వే ద్వారా నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల వంటి వాటిని గుర్తించడానికి ఈ ప్రత్యేక స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామన్నారు. క్యాన్సర్ నుంచి రక్షించుకునేందుకు ప్రజలకు స్వీయ సంరక్షణా సాధనాలపై అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.



క్యాన్సర్ అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు

# యమ డేంజర్!



- గోదావరిని గుల్ల చేస్తున్న ఇసుక మాఫియా
- రోడ్డు కమ్ రైలు వంతెన సమీపాన యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- వంతెన భద్రతపై ఆందోళన
- కన్నెత్తి చూడలేని స్థితిలో అధికార యంత్రాంగం

సాక్షి, రాజమహేంద్రవరం: ఇసుక మాఫియా బరితెగిస్తోంది. అధికారం చేతిలో ఉంది కదా అని రెచ్చిపోతోంది. నిబంధనలు తుంగలో తొక్కి మరీ గోదావరి నదిని ఇష్టానుసారం గుల్ల చేసేస్తోంది. అందరూ చూస్తుండగానే నిషేధిత ప్రాంతాల్లో సైతం ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగిస్తోంది. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను గోదారిలో తొక్కేస్తోంది. ఇసుకను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతోంది. కూటమి ఎమ్మెల్యేలు, నేతల కనుసన్నల్లోనే ఈ తంతు 'మూడు ట్రాక్టర్లు.. ఆరు లారీలు' అన్న చందంగా సాగుతోంది. అడిగేవారు, అడ్డుకునేవారు లేకపోవడంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఈ దందా నిరాటంకంగా సాగిపోతోంది. అయినప్పటికీ ఇసుక మాత్రం సామాన్యులకు అందడం లేదు.

### రోడ్ కమ్ రైలు వంతెన వద్ద..

గోదావరి నది అంతటా ఇసుక ఉన్నప్పటికీ అధికారులు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం నగరం వద్ద రోడ్ కమ్ రైలు వంతెన, గామన్ వంతెనల సమీపాన ఇసుక తవ్వకాలను నిషేధించారు. అక్కడ తవ్వకాలు జరిపితే ఆ వంతెనలు దెబ్బ తిని, వాటి మనుగడ ప్రశ్నార్థకమయ్యే అవకాశం ఉంది. ధవళేశ్వరం బ్యారేజ్, రోడ్ కమ్ రైలు వంతెన సమీప ప్రాంతాల్లో ఇసుక తవ్వరాదని గ్రీన్ ట్రిబ్యునల్ హెచ్చరించింది కూడా. హైకోర్టు సైతం బ్రిడ్జి ప్రాంతంలో తవ్వకాలను నిషేధిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. అయినప్పటికీ అక్రమార్కులు ఆగడం లేదు. ఏ ఆదేశాలూ తమకు వర్తించవనుకున్నట్టుగా ఇసుక మాఫియా.. నిషేధిత ప్రదేశాల్లో సైతం తవ్వకాలు చేపడుతోంది. నిషేధిత ప్రాంతమైన రోడ్ కమ్ రైలు వంతెన పరిసరాల్లో గురువారం ఇసుక అక్రమ తవ్వకాలు అందరూ చూస్తుండగానే పట్టపగలే కొనసాగాయి.

కొవ్వూరు ప్రాంతానికి చెందిన రెండు, రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన రెండు బోట్ల ద్వారా ఈ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరిపారు. రోడ్ కమ్ రైలు బ్రిడ్జి సమీపాన ఈ ప్రాంతంలోనే రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఇటీవల ఫ్లోటింగ్ రెస్టారెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అయినప్పటికీ ఇక్కడి నిషేధిత ప్రాంతంలో ఇసుక తవ్వుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు ఈ ప్రాంతానికి చేరువలోనే లంక గ్రామాల ప్రజలు నివసిస్తున్నారు. అయినప్పటికీ పట్టించుకోకుండా అక్రమార్కులు ఇసుక తవ్వుకుపోతూ, యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తవ్వకాల వెనుక కూటమి నేతలున్నారని, అందువల్లనే అటువైపు కన్నెత్తి చూసే నాథుడే లేకుండా పోయాడనే విమర్శలు వస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామంటున్న అధికారుల మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం చేసుకోవడం.. కేసులు పెట్టడానికే పరిమితమవుతున్నారు తప్ప.. అక్రమ తవ్వకాలను అడ్డుకునేలా పటిష్ట చర్యలు తీసుకోవడానికి వారు వెనుకాడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మాఫియాపై కఠిన చర్యలకు దిగితే కూటమి నేతలు రంగంలోకి దిగి ఒత్తిళ్లు తెస్తుండటంతో చేసేది లేక అధికారులు మిన్నకుండిపోతున్నట్లు సమాచారం.



రోడ్డు కమ్ రైలు వంతెన వద్ద ఇసుకను తరలిస్తున్న పడవలు

### బ్రిడ్జికి ఎంతో ప్రత్యేకత

రోడ్ కమ్ రైలు వంతెన దేశంలోనే ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ వంతెనపై ప్రతి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కింది భాగంలో రైల్వే ట్రాక్‌పై అనేక రైళ్లు నడుస్తుంటాయి. వంతెన సమీపంలోను, పరిసర ప్రాంతాల్లోను ఇసుక తవ్వకాలు సాగించడం వల్ల ఈ చారిత్రక కట్టడం భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన పటిష్టంగా లేదన్న అనుమానాలు గతంలో కూడా తలెత్తాయి. రైల్వే ట్రాక్ సైతం దెబ్బ తినడంతో బ్రిడ్జిని మూసివేస్తారన్న అనుమానాలు వచ్చాయి. అయితే బ్రిడ్జికి ఎలాంటి ఢోకా లేదని, భద్రతా పరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు వెల్లడించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



హేవలాక్ వంతెన సమీపాన పడవలతో ఇసుక రవాణా



వాడపల్లి వైపు రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జి సమీపాన ఇసుక తవ్వకాలు

వంతెన పిల్లర్లకు రెండువైపులా ఇసుక మేటలు ఉంటాయి. దీంతో వంతెన పటిష్టంగా ఉంటుంది. ప్రస్తుతం ఇసుక విచ్చలవిడిగా తవ్వేస్తుండటంతో వంతెన పటుత్వం కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం బోట్స్‌మెన్ సభ్యులే తవ్వకాలు చేస్తున్నా.. రాత్రుళ్లు గుట్టు చప్పుడు కాకుండా యంత్రాలతో తవ్వకాలు చేపడితే పరిస్థితేమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ బ్రిడ్జి వద్ద తవ్వకాలకు ఎవరు అనుమతులు ఎవరిచ్చారనేది ప్రశ్నార్థకంగా మారుతోంది.

## క్లుప్తంగా

### రేగు కాలువలో మృతదేహం



గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం

కాకినాడ క్రైం: కాకినాడలోని ఏటిమొగలో బోటు యార్డు పక్కనే ఉన్న రేగు కాలువలో బుధవారం రాత్రి సుమారు 35 ఏళ్ల లోపు వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96543, 95059 11329 నంబర్లకు ఫోన్ చేసి పోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ, ఎస్సైలకు వివరాలు తెలియజేయాలని అన్నారు.

### అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



సింగవరంలో దగ్ధమవుతున్న తాటాకు ఇల్లు

సీతానగరం: మండలంలోని సింగవరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో చిట్రోతు సీతారత్నానికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. గురువారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చుట్ట పక్కలవారు అందినంత మేర నీళ్లు చల్లినా మంటలు అదుపు కాలేదు. ఇటుకలతో కట్టిన గోడలపై తాటాలు వేసి ఉన్న ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. వంట సామగ్రి, మంచాలు, ఫ్యాన్లు, టీవీ, పది కాసుల బంగారు అభరణాలు, సర్టిఫికెట్లు, దుస్తులు అగ్ని ప్రమాదంలో కాలిబూడిద అయ్యాయని బాధితులు తెలిపారు. సీతారత్నంతో పాటు చదువుతున్న మనుమరాలు ఉంటున్నారు. సమచారం అందుకున్న అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఘటన స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది పరిశీలించి సుమారు రూ.8 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు.

### రెండు ఆలయాల్లో చోరీ

**బాబా ఆలయంలో రూ.30 వేల అపహరణ**

అల్లవరం: కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని సాయిబాబా, సీతారామాంజనేయ స్వామి ఆలయాల్లో బుధవారం రాత్రి హుండీలను పగలగొట్టి నగదు చోరీ చేశారు. సాయిబాబా గుడిలోని హుండీలో రూ. సుమారు 30 వేలు నగదు ఉండవచ్చని ఆలయ కమిటీ తెలిపింది. హుండీలో నగదు తీసుకెళ్లి నాణేలను వదిలేశారని అక్కడి సిబ్బంది తెలిపారు. ఈ చోరీలపై ఆలయ కమిటీలు చేసిన ఫిర్యాదుల మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు చోరీ జరగడంపై మండలంలో చర్చనీయాంశమైంది. చోరీలను నియంత్రించడంలో పోలీసులు విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో నిఘా పెంచాలని కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన యువత అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో బాబి, వెంకటేష్ పాల్గొన్నారు.

# బీమాగా.. ధీమాగా



దేవరపల్లి మండలం కొత్తగూడెంలో జీడిమామిడి తోట



జీడిమామిడి పండ్లు

- జీడిమామిడికి బీమా పథకం వర్తింపు
- ఈ ఏడాది నుంచి అమలు
- 15వ తేదీ వరకూ గడువు
- వాతావరణ ఆధారిత బీమాకు చర్యలు

దేవరపల్లి: సాగు అంటే.. ఎన్నో ఒడిదొడుకులు.. మరెన్నో కష్టాలు. ప్రకృతి కన్నెర్రజేసినా, పురుగులు దాడి చేసినా, వరదలు ముంచేసినా, అనుకోని విపత్తులు వచ్చినా చివరికి నష్టపోయేది పుడమిపుత్రులే. ఇలాంటి పరిస్థితుల్లో జీడిమామిడి రైతులకూ వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు. 2016లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను ప్రారంభించారు. అప్పట్లో ఉద్యాన శాఖ ద్వారా జీడిమామిడి పంట రైతులకు వర్తింపజేశారు. అనంతరం బీమా పథకం అమలు కాలేదు. 2024–25 సంవత్సరం నుంచి జీడిమామిడి పంటకూ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలనే ఆలోచనతో ఉద్యాన శాఖ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. దీని కోసం రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ జీడిమామిడి తోటలకు ఈ నెల 15లోగా బీమా చేయించుకోవాలని ఉద్యాన శాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఖరీఫ్‌లో అరటి పంటకు, రబీలో జీడిమామిడి పంటకు బీమా సౌకర్యం కల్పించారు. వాతావరణ గణన ఏపీఎస్‌డీపీఎస్ ఇచ్చిన నివేదిక ఆధారంగా దీనిని అమలు చేస్తున్నారు.

**ప్రతికూల వాతావరణం అంటే..**

వర్షపాతం తక్కువ, ఎక్కువ, అనుకోని వర్షం, వాన పడిన రోజులు, కురవని రోజులను బట్టీ ప్రతికూల వాతావరణాన్ని లెక్కిస్తారు. అత్యధిక ఉష్ణోగ్రత, అత్యల్ప ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌కు మించి 3–10 రోజులు (నవంబర్ 1 నుంచి ఫిబ్రవరి 28 వరకూ) ఉంటే పరిగణనలోకి తీసుకుంటారు. గాలిలో తేమశాతం, గాలి వేగం తదితర పరిస్థితులను కూడా లెక్కిస్తారు. తూర్పుగోదావరి జిల్లాలో జీడిమామిడి పంటకు బీమా చేసేందుకు ఇఫ్కో, టోక్యో జనరల్ ఇన్‌స్రూ కంపెనీలకు అవకాశం ఇచ్చారు.

**రూ.1,500 ప్రీమియం**

ఎకరాకు రూ.1,500 ప్రీమియాన్ని చెల్లిస్తే బీమా వర్తిస్తుంది. గరిష్ట పరిమితి లేదు. ఒక రైతు ఎన్ని ఎకరాలకైనా బీమా చేయించుకోవచ్చు. ఈ–కేవైసీలో నమోదు చేసుకున్న విస్తీర్ణానికి బీమా చేయవచ్చు. ఈ నెల 15 వరకూ ప్రీమియం చెల్లించడానికి గడువు ఉంది. ఇప్పటికే బ్యాంకుల్లో రుణం పొందిన, రుణం తీసుకోని రైతులు అర్హులే. బీమా పథకం వివరాల కోసం జిల్లా టెక్నికల్ ఉద్యాన శాఖ అధికారి ఎస్.రాజ్‌కుమార్ 92900 33325, గ్రామ స్థాయిలో వీఏఏ, వీహెచ్‌ఏలను కూడా సంప్రదించవచ్చు.

**నమోదు తప్పనిసరి**

బీమా చేయించుకునే రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలి. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉద్యాన శాఖ అధికారులు ఇప్పటికే పంట బీమా పథకం గురించి అవగాహన కల్పిస్తున్నారు.

**పంట ఎంతంటే..**

జిల్లాలో 7,219 మంది రైతులు 21,613 ఎకరాల్లో జీడిమామిడి పంట, 7,915 మంది రైతులు 13193 ఎకరాల్లో అరటి పంట సాగు చేస్తున్నారు. రాజానగరం, రంగంపేట, దేవరపల్లి, గోపాలపురం, కోరుకొండ, గోకవరం, చాగల్లు, నల్లజర్ల మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో జీడిమామిడి పంట సాగవుతోంది. మండల యూనిట్‌గా బీమా వర్తిస్తోందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం లేక 1బీ పత్రం, ఆధార్ నకలు, బ్యాంకు ఖాతా పుస్తకం మొదటి పేజీ నకలు, పంట ధ్రువీకరణ పత్రం రైతులు అందజేయాల్సి ఉంటుంది.

**సద్వినియోగం చేసుకోండి**



అరటి పంటలు సాగు చేస్తున్న రైతులు బీమా పథకాన్ని వినియోగించుకోవాలి. ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాలి. ఏదైనా విపత్తు ఎదురై పంట నష్టపోతే పరిహారం నేరుగా రైతు బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఖరీఫ్‌లో అరటి, రబీలో జీడిమామిడి పంటకు బీమా వర్తిస్తోంది. మరిన్ని వివరాలకు రైతులు గ్రామ స్థాయిలోని వీఏఏ, వీహెచ్‌ఏలను సంప్రదించాలి.

–బి.సుజాత కుమారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, రాజమహేంద్రవరం

# అక్రమ అరెస్టులు ఆపాలి



రంగంపేటలో చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



రంగంపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ సుమంత్‌తో మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

- వైఎస్సార్ సీపీ కార్యకర్త అరెస్టుపై ధర్నా
- మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై జరుగుతున్న అక్రమ అరెస్టులు వెంటనే ఆపాలని రంగంపేట పోలీస్ స్టేషన్ వద్ద గురువారం మండలంలోని ఆ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. వడిశలేరు గ్రామానికి చెందిన వీరబత్తుల చంద్రశేఖర్ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టాడని రంగంపేట ఎస్ఐ కృష్ణసాయి, అనపర్తి సీఐ సుమంత్‌లు బుధవారం ఉదయం చంద్రశేఖర్ భార్య విజయకు ఫోన్ చేశారు. చంద్రశేఖర్ ఫోన్ నంబర్ తీసుకున్నారు. అప్పటి నుంచి అతను కనిపించకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అప్పటి నుంచీ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పకపోవడంతో బుధవారం అర్ధరాత్రి రంగంపేట పోలీస్ స్టేషన్ ఎదురుగా ఏడీబీ రోడ్డుపై చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. అనపర్తి సీఐ సుమంత్ ఆందోళనకారులతో చర్చించి హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. తిరిగి గురువారం కూడా చంద్రశేఖర్ ఎక్కడ ఉన్నదీ పోలీసులు చెప్పకపోవడంతో సాయంత్రం అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బాధితుడి కుటుంబ సభ్యులు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు రంగంపేట పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. అనంతరం రంగంపేట పోలీస్ స్టేషన్‌లో అనపర్తి సీఐ సుమంత్‌తో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి చర్చలు జరపగా, నిందితుడు చంద్రశేఖర్ తమ ఆధీనంలో లేదని గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడని, శుక్రవారం రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరుస్తారని సీఐ సుమంత్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని, సోషల్ మీడియాలో టీడీపీకి సంబంధించిన వారు కూడా తమపై పోస్టింగ్‌లు పెడుతున్నారని అటువంటి వారిపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని నిలదీశారు. తప్పు ఎవరు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అలా కాకుండా, వైఎస్సార్ సీపీ శ్రేణులపైనే అక్రమంగా కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని, అధైర్య పడొద్దని సూర్యనారాయణరెడ్డి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### యువకుడిపై పోక్సో కేసు

కొవ్వూరు: ప్రేమ పేరుతో యువతిని వంచించి పెళ్లికి నిరాకరించిన కడియపులంక గ్రామానికి చెందిన దాసరి వెంకట సతీష్‌పై గురువారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు పట్టణానికి చెందిన యువతి అమ్మమ్మ స్వగ్రామం కడియపులంక. ఆమె తరచుగా అమ్మమ్మ ఇంటికి వచ్చి వెళ్తూ ఉండేది. ఈ క్రమంలో ఆమెను సతీష్ ప్రేమిస్తున్నానని నమ్మబలికి గర్భవతిని చేశాడు. అనంతరం పలు ట్యాబ్‌లెట్లు వేసి అబార్షన్ చేయించాడు. అనంతరం పెళ్లి చేసుకోవాలని కోరగా అతడు నిరాకరించాడు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. యువతిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# రేపటి నుంచి భక్తజనగిరి



తూర్పు రాజగోపురం వద్ద భక్తుల సందడి

- వరుస సెలవులు, పర్వదినాలతో రత్నగిరికి పోటెత్తనున్న భక్తులు
- సత్యదేవుని తెప్పోత్సవానికి ఏర్పాట్లు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి శనివారం నుంచి వరుసగా ఆరు రోజుల పాటు భక్తులు పోటెత్తనున్నారు. రెండో శనివారం, ఆదివారాలు సెలవులు, తరువాత కార్తిక సోమవారం, మంగళవారం ఏకాదశి కావడంతో ఆయా రోజుల్లో రత్నగిరికి భక్తులు లక్షలాదిగా వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని పంపా నదిలో సత్యదేవుని తెప్పోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకం వద్ద నిత్యం పది వేల మందికి ఉచితంగా పులిహోర, దద్యోజనం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆరు రోజులూ సుమారు మూడు లక్షలకు పైగా భక్తులు రావచ్చని, సత్యదేవుని వ్రతాలు 30 వేలకు పైగా జరుగుతాయని, రూ.రెండు కోట్లకు పైగా ఆదాయం వస్తుందని భావిస్తున్నారు.

**గురువారం స్వామి దర్శనానికి 30 వేల మంది**

కాగా, గురువారం సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు 1,600 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోప్రదక్షిణ చేసి శ్రీకృష్ణునికి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా రూ.30 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటాలి

- ఢిల్లీ జేఎన్‌యూ వీసీ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్
- నన్నయలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు ప్రారంభం



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్

రాజానగరం: తెలుగు భాషా వైభవాన్ని భారతదేశంలోనే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా తెలియజేయాలని న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఆంగ్ల విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి, విజయవాడలోని సెంటర్ ఫర్ ఏపీ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ×ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ పండిట్ మాట్లాడుతూ, దేశంలో భాషాభిమానం అధికంగా ఉన్న వారిలో తమిళులు మొదటి వరుసలో ఉంటారని అన్నారు. తెలుగు వారు కూడా ఆ విధమైన భాషాభిమానం చాటుకోవాలని సూచించారు. జాతిని జాగృతం చేయడానికి గత వైభవ స్మరణ ఎంతో అవసరమన్నారు. కందుకూరి, గురజాడ వంటి మహనీయులను నిరంతరం స్మరించుకుంటూ భావితరాలకు మన సంస్కృతిని అందించాలని సూచించారు.

నన్నయ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో భాష, సాహిత్యం, ఇతిహాసాలు, వాయిస్ టు వాయిస్ కమ్యూనికేషన్ ఎక్కువని, లిఖిత పూర్వకంగా ఉన్న సంస్కృతి తక్కువగా ఉందని అన్నారు. కాప్స్ చైర్మన్, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఉపాధి అవకాశాల పైనే దృష్టి సారిస్తూ సామాజిక అంశాలను విస్మరిస్తున్నామని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అవసరమే కానీ, సామాజిక అంశాలు మానవ మనుగడకు ఎక్కువ ఉపయోగపడతాయని అన్నారు. పూర్వ కాలంలో కోరంగిలోని సుప్రసిద్ధ నౌకా నిర్మాణ కేంద్రం ఉండడం, దాని ఖ్యాతి ఖండాంతరాలకు వ్యాపించడం వల్ల భారతీయులను విదేశాల్లో కోరంగీలు అనేవారని, అటువంటి వైభవం నేడు ఎక్కడా కనపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూచిపూడి విద్యార్థుల నృత్య ప్రదర్శన, చిత్రకళా ప్రదర్శన, తోలుబొమ్మలాట (ఇంటర్నేషనల్ థీమ్), గణిత అవధానం, కోనసీమ వారు ప్రదర్శించిన బుర్రకథ, హరికథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కన్వీనర్లు ఆచార్య కేఎస్ రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ ఎస్.సుజనారాజ్, కాప్స్ ఉపాధ్యక్షుడు ఆచార్య జి.నాగేశ్వరరావు, సెక్రటరీ ఓలేటి సత్యనారాయణ, అటవీ శాఖ విశ్రాంత అధికారి నళినీ మోహన్, వర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



### రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు కోట విద్యార్థులు



రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

సామర్లకోట: ఈ నెలలో జరిగే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు సామర్లకోటకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 4వ తేదీ నుంచి అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన అండర్ 14, 17 విభాగాల్లో సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం.చైతన్య ప్రేమ్‌కుమార్, వర్ధనపు యశ్వంత్ తేజ (అండర్ 17 విభాగం నుంచి) ఎంపికయ్యారని హెచ్‌ఎం యూ.సత్యనారాయణ, పీడీ ఎం.వెంకటేశ్వర్లు గురువారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఉమ్మడి జిల్లా జట్టు నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### 9న నన్నయలో కవి సమ్మేళనం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆచార్య శ్రీనివాసరావు తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శనివారం జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. వర్సిటీలోని సెమినార్ హాలులో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం బ్రోచర్‌ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు గురువారం విడుదల చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిషా రాష్ట్రం నుంచి 150 మంది కవులు హాజరుకానున్నారని, యువతలో కవితా స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, కన్వీనర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, డాక్టర్ తలారి వాసు, డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు, డాక్టర్ సంజీవయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్‌ఎల్‌లో సిమ్యుల్కాన్–2024

- హెల్త్‌కేర్ సిమ్యులేషన్ సొసైటీ ఆధ్వర్యంలో 6వ వార్షిక సదస్సులు



గేమిఫికేషన్‌పై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న వైద్యులు

రాజానగరం: స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో హెల్త్‌కేర్ సిమ్యులేషన్ సొసైటీ (ఎస్‌హెచ్‌ఎస్) ఆధ్వర్యంలో 6వ వార్షిక కాన్ఫరెన్స్ సిమ్యుల్కాన్–2024 గురువారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ఆధునిక సిమ్యులేషన్ పద్ధతుల ద్వారా వైద్య విద్యను బలోపేతం చేయడంపై సాగుతుందని సదస్సు సమన్వయకర్తలలో ఒకరైన డాక్టర్ గన్ని సందీప్ తెలిపారు. ఐదు ప్రీ కాన్ఫరెన్స్ వర్క్‌షాపులుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ప్రాక్టికల్ స్కిల్స్‌ని మెరుగుపర్చడం, సిమ్యులేషన్‌లో కొత్త ప్రయోగాలను అందించడాన్ని లక్ష్యంగా తీసుకున్నారు. ఇవి హెల్త్‌కేర్ విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు రూపొందించినట్టు తెలిపారు. మొదటి రోజు సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది హాజరయ్యారు. డాక్టర్ గన్ని భాస్కర రావు హోస్ట్‌గా వ్యవహరించారు.

### ప్రతిష్టాత్మకంగా బాలిక అదృశ్యం కేసు

**డీఎస్పీ శ్రీహరిరాజు**



విద్యార్థిని అదృశ్యంపై విచారణ నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యం కేసు పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని డీఎస్పీ డి.శ్రీహరిరాజు తెలిపారు. గత నెల 22న కళాశాలకు వచ్చిన విద్యార్థిని అదృశ్యమైంది. ఈ మేరకు ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును గురువారం సాయంత్రం డీఎస్పీ విచారణ చేపట్టారు. ఎస్సై లక్ష్మీకాంతంను కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన విద్యార్థిని తల్లితండ్రులతో సైతం ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థిని ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. విచారణ చురుగ్గా జరుగుతోందన్నారు. త్వరలోనే ఆమె అచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగిస్తామని భరోసా ఇచ్చారు.

# రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ జిమ్నాస్టిక్స్ ప్రారంభం



క్రీడాజ్యోతిని వెలిగించి రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు ప్రారంభిస్తున్న డీఈఓ రమేష్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ఐ జిమ్నాస్టిక్స్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పాఠశాల క్రీడాసమాఖ్య రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు అధ్యక్షత సాగిన ఈ కార్యక్రమంలో డీఈఓ పి.రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమిచ్చేందుకు పాఠశాలల పని వేళలు మార్చేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. భానుమూర్తిరాజు మాట్లాడుతూ జిల్లాలోని క్రీడావసతులను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది 7 రాష్ట్రస్థాయి ఎంపికలు, పోటీలను కాకినాడ జిల్లాకు కేటాయించామన్నారు. ఎస్‌జీఎఫ్ఐకు ఈ ఏడాది రూ.7.40 కోట్ల బడ్జెట్ ఉందన్నారు. రాష్ట్ర పరిశీలకులు పూర్ణచంద్రరావు, డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు క్రీడాజెండాను ఆవిష్కరించారు. ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 100 మంది సాంకేతిక సిబ్బంది పాల్గొంటున్నారు. ప్రారంభ కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి కె.నూకరాజు, ట్రెజరర్ సుందర్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళ మెడలో గొలుసు చోరీ

ఐ.పోలవరం: మండలం మురమళ్లలో ఒక మహిళ మెడలో బంగారు గొలుసులను ఒక వ్యక్తి చోరీ చేశాడు. గ్రామంలో శుభకార్యానికి వెళ్తున్న నూలు కమలావతిని వెనుక నుంచి మోటార్ సైకిల్‌పై వెంబడించిన ఒక వ్యక్తి అదను చూసి రెండు గొలుసులను లాక్కుని ఉడాయించాడు. సొత్తు విలువ రూ.ఐదు లక్షల వరకు ఉంటుందని బాధితురాలు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వ్యక్తి అనుమానాస్పద మృతి



మంగరాజు మృతదేహం

శంఖవరం: మండలంలోని శాంతి ఆశ్రమం అడ్డురోడ్డు సమీపంలోని మైనింగ్ డంపింగ్ యార్డు వద్ద వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రత్తిపాడు మండలం చింతలూరు గ్రామానికి చెందిన దడాల మంగరాజు (50) డంపింగ్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. యార్డులో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఏఎస్సై ప్రసాద్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఇసుక ట్రాక్టర్ సీజ్

పెరవలి: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కొద్ది రోజులుగా కానూరు అగ్రహారంలో రాత్రి సమయంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో బుధవారం రాత్రి దాడి చేసి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను మైనింగ్ శాఖకు అప్పగించామని ఆయన తెలిపారు.